తిరుమల తిరుపతి దేవస్థానములు

# బాల సప్తగిరి

సచిత్రమాసపత్రిక

డిసెంబరు 2020

## సప్తగిరి అనుబంధం





తిరుమల తిరుపతి దేవస్థానములు



# బాలసప్తగిరి

'సప్తగిరి' అనుబంధం

సంపుటి: 01 డిసెంబరు 2020 సంచిక: 10

## విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| హిందూదేవుళ్లు | శ్రీఆంజనేయస్వామి<br>- డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు | 32 |
| పన్నిద్దరాళ్వార్లు | మధురకవి ఆళ్వార్<br>- ఆచార్య కె.సర్వోత్తమరావు | 34 |
| కన్నడహరిదాసవరేణ్యులు | శ్రీమధ్వాచార్యులు<br>- శ్రీ దేసు వెంకటసుబ్బారావు | 36 |
| చిత్రకథ | భక్త ప్రహ్లాద!<br>కథ : శ్రీమతి సి.హెచ్.దీపశ్రీ<br>చిత్రాలు: కె.తులసీప్రసాద్ | 38 |
| బాలనీతి | పుట్టుకకు సార్థకత ఉండాలి!<br>- ఆచార్య పి.ఎల్.శ్రీనివాసరెడ్డి | 42 |
| విశిష్టబాలుడు | | 44 |
| క్విజ్ | నిర్వహణ: డా॥ కంపల్లె రవిచంద్రన్ | 45 |
| చిత్రలేఖనం | | 46 |


ముఖచిత్రం : గోదాదేవి
వెనుక చిత్రం : శ్రీరామబంటు

హిందూ దేవుళ్లు

# శ్రీఆంజనేయస్వామి

-డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు, 98499 15351

'ఆంజనేయస్వామి' అని పేరు చెబితే చాలు పిల్లలుసైతం కమనీయమైన ఆ దివ్యమంగళస్వరూపాన్ని కళ్ళల్లో నింపుకొంటారు. ఈ స్వామికి ఉన్న ప్రాచుర్యం, ప్రాభవం అలాంటివి. ఏ మాయకు లోను కాని ఏకైకదేవతామూర్తి హనుమంతుడు. ఏ మంత్రం, ఏ తంత్రం, ఏ యంత్రం, ఏ చక్రమూ ఇతణ్ణి ఏమీ చేయలేవు.

ఆంజనేయుడు అంటే అంజన కుమారుడు అని అర్థం. ఈయన తల్లి అంజన. గత జన్మలో పుంజికస్థలి అనే అప్సరస. బృహస్పతి సేవకు రాలు. శాపవశాత్తు భూమిపై వానరకన్యగా జన్మించింది. కేసరి అనే మహాబలశాలి అయిన వానరుడిని పెళ్లి చేసుకుంది. సంతానంకోసం శివుని గురించి తపస్సు చేసింది. శివుని వరప్రసాదంచేత, వాయుదేవుని అనుగ్రహంవల్ల అంజనకు ఆంజనేయుడు పుట్టాడు. అత్యంతసుందరంగా ఉండేవాడు.


బాలాంజనేయుడు తల్లికోరికమేరకు సూర్యుడిదగ్గరకు వెళ్లి విద్యను అభ్యసించాడు. నవవ్యాకరణాలూ చదివాడు. అన్నికళలూ నేర్చాడు. గురుదక్షిణగా ఏమి సమర్పించాలని ఆంజనేయుడు కోరితే, "నా కుమారుడైన సుగ్రీవునికి మంత్రిగా ఉండి, అనుక్షణం కాపాడుతూ ఉండు." అని సూర్యుడు అడిగాడు. ఆంజనేయుడు సరేనని చెప్పి కిష్కింధ చేరుకుని సుగ్రీవునిలో దగ్గర కొలువు ఉన్నాడు.

ఈలోగా, సీతను వెదకుతూ... రామలక్ష్మణులు వచ్చారు. ఆంజనేయుడు వారిని చూచి, సుగ్రీవునిదగ్గరకు తీసుకొనిపోయి, స్నేహం కల్పించాడు. రాముని చేత వాలిని చంపించి, సుగ్రీవునికి రాజ్యం వచ్చేలా చేశాడు- ఆంజనేయుడు. సీతను వెదడానికై స్వయంగా బయలుదేరాడు.

సముద్రాన్ని గాలిలో ఎగురుతూ దాటాడు. సీతను లంకలో కనుగొన్నాడు. రావణుని బెదిరించి, రాక్షసులను అదరగొట్టి, కొందరిని చంపి లంకా దహనం చేశాడు. తాను సీత దగ్గర తీసుకొన్న శిరోమణిని రాముడి దగ్గరకు తీసుకొని వెళ్లి, గుర్తుగా ఇచ్చి, సీత ఎక్కడున్నదీ చెప్పాడు. మంచి ముహూర్తం చూచి రాముడు యుద్ధానికి బయలుదేరాడు. రాక్షసులకు, వానరులకు భీకరమైన పోరు మొదలైంది.

ఇంద్రజిత్తు దెబ్బకు లక్ష్మణుడు మృత్యువుకు అతిచేరువ కాగా ఆంజనేయుడు సంజీవనిని తెచ్చి కాపాడాడు. మైరావణుడనే రాక్షసుడు రామలక్ష్మణులను బొమ్మలను చేసి, పాతాళలంకకు తీసుకొనిపోగా హనుమంతుడు ఆ మైరావణుని తనయుక్తితో చంపి, రామలక్ష్మణులను విడిపించుకుని వచ్చాడు.

రావణవధ అనంతరం అయోధ్యచేరి హనుమంతుడు శ్రీరాముని పట్టాభిషేకంలో పాల్గొన్నాడు. సీతమ్మవారు ప్రేమతో ముత్యాలహారాన్ని కానుకగా ఇస్తే ఆ ముత్యాలలో రాముడు ఉన్నాడేమోనని అన్నింటిని కొరికి ప్రక్కన పడవేశాడు. అందరూ అధిక్షేపించగా తన గుండెను చీల్చి సీతారాములను చూపిస్తాడు. సీతమ్మమెడలోని ముత్యాల హారాన్ని చూపుతాడు.



అలా... శ్రీరామభక్తుడిగా అందరి హృదయాలలో నిలిచిపోయాడు.

పన్నిద్దరాళ్వార్లు

# మధురకవి ఆళ్వార్

- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

లోకంలో మానవుల మధ్య రకరకాలసంబంధాలుంటాయి. రక్త సంబంధం, వ్యాపారసంబంధం, భార్యాభర్తలసంబంధం, భక్తునికి భగవంతుని తోడి సంబంధం, గురుశిష్యసంబంధంలాంటివి.

ఒక మర్రిచెట్టు. ఆ చెట్టుకింద అరుగుపై దక్షిణామూర్తి. ఎదురుగా నేలపై ఆసీనులైనవారు జిజ్ఞాస గల మునిశిష్యులు. వారు తమ మెదడును తొలిచే ఆధ్యాత్మికసందేహాలు గురువైన దక్షిణామూర్తిని అడిగి తెలుసుకోవాలనుకున్నారు. గురువు మౌనవ్రతుడు. అయినా, ఆ గురు సందర్శనంతోనే ఆ తేజఃప్రభావశక్తితో శిష్యుల సంశయాలు తీరాయని ప్రసిద్ధి. ఇది పౌరాణికవృత్తాంతం శ్రీవైష్ణంలో ఆళ్వార్ తిరునగరిలోని చింతచెట్టు తొర్రలోని నమ్మాళ్వార్ వయసా చిన్నవాడు. అయినా మధురకవి ఆళ్వార్ ఆధ్యాత్మికసందేహాలను నమ్మాళ్వార్ సంతృప్తికరంగా తీర్చడంతో మధురకవి ఆళ్వార్ నమ్మాళ్వార్‌ను ఆచార్యులుగా వరించారు. మధురకవికి సర్వం గురువే! సర్వం ఆచార్యుడే. ఆచార్యనిష్ఠకు సరి అయిన ఉదాహరణప్రాయుడు మధురకవి ఆళ్వార్. వీరిద్దరు భిన్నకులస్థులైనా వారి గురుశిష్యసంబంధానికి ఎలాంటి అడ్డుగోడలు లేవు. పైగా గురువైన నమ్మాళ్వార్‌కు గుడి కట్టించిన ధన్యుడు మధురకవి ఆళ్వార్. ఇతనిచరిత్ర ఓ రకంగా చూస్తే వింత.

ఆళ్వార్‌తిరునగరికిదగ్గరలో 'తిరుక్కోళూరు'లోని. ఆ నారాయణ దీక్షితులు కుమారుడు కుముదుడు. మధురమైన కవిత్వం చెప్పడంవల్ల ఈయనకు 'మధురకవి' అనే పేరు స్థిరమైంది. మధురకవికి తొలిగురువు తండ్రి. తండ్రిదగ్గర సకలశాస్త్రాలు నేర్చి, సామాన్యజీవితం గడపడానికి ఇష్టపడక తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఉత్తరభారతదేశంలోని పుణ్య క్షేత్రాలు సేవించి అయోధ్యలో కొన్నాళ్లు గడిపాడు.

ఒకరోజు రాత్రి మధురకవికి దక్షిణపుదిక్కున ఒక దివ్యతేజస్సు కనిపించింది. అగ్నిజ్వాలనం అనుకొన్నాడు. కానీ, ఉదయం అలాంటి చిహ్నాలు కనబడలేదు. మరుసటిరోజురాత్రి మధురకవికి దివ్యతేజస్సు కనిపించింది. ఇతరులకు కనిపించకపోవడంతో మధురకవి ఆ దివ్య తేజస్సు ప్రదేశాన్ని వెదకడానికి బయలుదేరాడు. చాలారోజుల తర్వాత ఆ తేజస్సును చూస్తూ, చివరకు ఆదినాథస్వామిని సేవించి, వచ్చేవేళ పట్టపగలే ఒక చింతచెట్టుతొర్రలో దివ్యతేజస్సు ఆకారం కనబడింది. ఎవరో మహాత్ములని పలకరించినా జవాబు లేదు.



ఒక పెద్దబండను ఎత్తి శబ్దం వచ్చేలా కొట్టగా నమ్మాళ్వార్‌కు ధ్యానభంగమైంది. కళ్లు తెరచి మధురకవిని చూచాడు. తొర్రలోని మహాత్మునికి మాటలు వచ్చో రావో అని ఆధ్యాత్మిక ప్రశ్నలు వేశాడు.

నమ్మాళ్వారు సంతృప్తికరమైన సమాధానం చెప్పడంతో ఆయన పాదాలకు దండప్రణామం చేసి, 'దాసోహం' అన్నాడు. నమ్మాళ్వార్ మధురకవిని శిష్యులుగా స్వీకరించాడు. నమ్మాళ్వార్ ప్రఖ్యాతని దేశమంతటా ప్రచారం చేస్తూ అనేకపాశురాలు రచించాడు.

గురువే సర్వస్వమని భావించడం. గురువే శ్రీహరి అని నమ్మడం. అతడే జ్ఞానోపదేశికుడు. శ్రీమహావిష్ణువే ఆచార్యుడై జీవులను ఉద్ధరించువాడు అనేభావం మధుర కవి జీవనసారాంశం.

కన్నడ హరిదాస వరేణ్యులు

# శ్రీమధ్వాచార్యులు

- శ్రీ దేసు వెంకటసుబ్బారావు, 91600 53535

శ్రీమధ్వాచార్యులు క్రీ.శ.1040వ సంవత్సరంలో కర్ణాటకలోని ఉడిపిక్షేత్రానికి దగ్గరలోని పాజక క్షేత్రంలో జన్మించారు. వీరు పుట్టినప్పుడు పెట్టినపేరు వాసుదేవుడు. తరువాత 12వ ఏట వీరికి అచ్యుతప్రేక్ష అనే పేరు వచ్చింది. సన్యాసం స్వీకరించిన తరువాత వీరికి పూర్ణప్రజ్ఞులు అనే పేరు వచ్చింది.


ఉడిపి శ్రీకృష్ణాలయంలో ఉన్న శ్రీకృష్ణవిగ్రహప్రతిష్ఠ, ద్వాదశస్తోత్ర రచన గురించిన ఒక కథ బహుళప్రచారంలో ఉంది.

ఒకనాడు మధ్వాచార్యులు సముద్ర తీరాన సంధ్యావందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే సమయానికి సముద్రంలో గాలి తుఫాను చెలరేగింది. దూరంగా ఒక నావ అలలతాకిడికి, గాలితాకిడికి అతి భయానకంగా ఊగిపోతూ ఉంది. అది చూచిన ఆచార్యులు తన పైనున్న ఉత్తరీయాన్ని తీసి, గాలిలో ఊపుతు అలలను, గాలిని నియంత్రించారట!

తరువాత నావ సునాయాసంగా ఒడ్డుకు చేరుకుంది. నావయజమాని తన ప్రాణాలను, నావను రక్షించినందుకు కృతజ్ఞతగా నావలోని సమస్తసంపదనూ ఆచార్యులవారికి కానుకగా ఇవ్వబోయాడు.

ఐతే, ఆచార్యులవారు సున్నితంగా ఆ సంపదను తిరస్కరించి, నావలోని గోపిచందనపురాశిని తనకు ఇవ్వమని అడిగారట. ఆ నావలోని గోపిచందనపు రాశి ఎలా వచ్చిందో తెలియని ఆ నావయజమాని గుట్టగా గడ్డగట్టిన గోపిచందనాన్ని ఆచార్యులవారికి సమర్పించాడట. ఆచార్యులు దివ్యదృష్టితో గోపించందనం మాటున రుక్మిణీమాత పూజించి, అర్చించిన శ్రీకృష్ణభగవానుని విగ్రహం ఉందని తెలుసుకున్నారు.

తరువాత ఆ గోపి చందనపు ముద్దని శుద్ధి చేయగా శ్రీకృష్ణవిగ్రహం కనిపించింది. ఆ విగ్రహాన్ని పవిత్రజలాలతో శుభ్రపర చారు.



తరువాత ఆవిగ్రహాన్నే ఆచార్యులవారు ఉడిపిలోని శ్రీకృష్ణమందిరంలో ప్రతి ష్ఠించి నిరాటంకంగా 20 సంవత్సరాలు సేవిం చారట! ఆ విగ్రహమే చల్ల కవ్వంతో ఉన్న బాలకృష్ణ విగ్రహం. ఉడిపిలోని కృష్ణమందిరంలో నేటికినీ సేవలనందుకుంటున్నదీ కృష్ణవిగ్రహం.

తరువాత మధ్వాచార్యులు ఉడిపి సమీప గ్రామాల నుండి 8 మంది శిష్యులకు సన్యాసం ఇచ్చి 8 మఠాలను నెలకొల్పి వాటికి నిర్వాహకులుగా నియమించారు. ఒక నిర్దిష్టపద్ధతిని ఆచరించాలని ఆశించి ఈ మఠాల ద్వారానే ఉడిపికృష్ణమందిరంలో వంతులవారిగా ప్రతిరెండునెలలకు ఒక మారు ఆలయకైంకర్యాలను నిర్వహించాలని ఆదేశించారు.

ఐతే తరువాత కాలంలో శ్రీవాదిరాజులవారు క్రీ.శ. 1532లో రెండు నెలల కాలాన్ని రెండు సంవత్సరాలకు మార్పుచేశారు. అప్పటినుండీ ఇప్పటి వరకు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఈ విధానాన్నే పర్యాయంగా వ్యవ హరిస్తారు.

చిత్ర కథ


# భక్తప్రహ్లాద!

కథ – శ్రీమతి సి. హెచ్. దీపశ్రీ
చిత్రాలు – కె. తులసీప్రసాద్


హిరణ్యకశిపుడు విష్ణుద్వేషి. విష్ణువుపై పగబూని బ్రహ్మను గూర్చి తపస్సు చేసి వరాలు పొందుటకు అడవులకేగాడు.

అదే అదునుగా.. అతనివంశం నాశనం చేయనెంచి నిండు గర్భిణి లీలావతిని అపహరించుకు పోతున్నాడు ఇంద్రుడు.

దారిలో నారదుడు కనిపించి...




నారదుడు ఆమెను ఇంద్రునిబారినుండి రక్షించి, తన ఆశ్రమానికి తీసుకు వెళ్లి, ఆమెకు విష్ణుబోధలను చేశాడు. ఆమెతో పాటు ఆమె గర్భములో ఉన్న శిశువుకూడా ఆ బోధనలను ఆలకిస్తూ అపారవిష్ణు భక్తి పొందెను.







బ్రహ్మవరప్రభావితుడై హిరణ్యకశిపుడు పుత్రోత్సాహంతో లీలావతిని తీసుకువెళుతూ నారదునికి కృతజ్ఞతలు తెల్పాడు. ఆ శిశువే ప్రహ్లాదుడు.



ప్రహ్లాదునకు ఐదేళ్లవయసులోనే రాక్షస గురువులైన చండామార్కులు విద్యాబుద్ధులు నేర్పించి, తండ్రి దగ్గరకు తోడ్కొని వచ్చిరి. కుమారుని విద్యాబుద్ధులు పరీక్షించిన హిరణ్యకశిపుడు అతని హరిభక్తిని చూచి సహించలేకపోయాడు.
ఇదేనా మీరు నేర్పిన విద్యలు? ఇతనికి హరిభక్తి ఎవరు నేర్పారు?
మాకు ఏమీ తెలీదు. దానవేంద్రా! మమ్మల్ని రక్షించండి!
ప్రహ్లాదుని ఇక శిక్షించక తప్పదు
హరిభక్తిమానునంతవరకు నా కుమారుడని దయ తలచక ఇతణ్ణి చీకటిచెరలో బంధించి, అన్నపానీయాలు లేకుండా చేయండి ఇది మా ఆజ్ఞ!
రాజు ఆజ్ఞమేరకు దండనాయకులు ప్రహ్లాదుని అన్నపానీయాలకు దూరంగా చీకటిచెరలో బంధించారు.
ప్రహ్లాదుడు భీతిల్లక ఆకలిదప్పులకు అతీతంగా హరినామస్మరణతోనే గడిపాడు.
అంధకారాన్ని తొలగించే జ్ఞానజ్యోతి స్వరూప నారాయణ


అన్నాహారాలు మాని కుమారుని చింతతో గట్టి నేలపై శయనించిన తల్లిని చూచి భక్తవత్సలుడైన హరి తల్లి చెంతకు కుమారునిగా, కుమారుని చెంతకు మాతృదేవతలా వచ్చి వారికి ఆకలి దప్పికలు తీర్చి అలరించాడు.
అమ్మ! మొదట నీవు ఆహారం స్వీకరించు
హరి భక్తిని వీడని ప్రహ్లాదునికి శిక్షలను హిరణ్యకశిపుడు తీవ్రతరం చేశాడు. ఆయుధాలతో శిక్షవృథా అయ్యింది.
ఓం నమో నారాయణాయ
ఏనుగులతో తొక్కించ ప్రయత్నించగా అవి అతని భక్తికి దాసోహ మాయెను.
శిఖరాగ్రం నుండి తోసి వేయగా లక్ష్మీవల్లభుడు రక్షించెను.
ఇవన్నీ.. భటులు చెప్పిన అసత్యములని ఎంచి, హిరణ్యకశిపుడు విషం తెప్పించి, తన స్వహస్తాలతో ప్రహ్లాదునికిచ్చి తాగించాడు.
విషసర్పాలతో కాటు వేయించ ప్రయత్నించగా అవి పూలమాలలు అయిపోయాయి.
మంటల్లో వేయించగా అతనికది అంటనే లేదు.
బంధించి నడి సముద్రంలో విడువగా మత్స్యకన్యలు విడిపించి ఒడ్డుకు చేర్చారు.
శేషశయన నారాయణ..
ఓం నమో నారాయణాయ
ఓం నమో నారాయణాయ
కానీ, ప్రహ్లాదుడు తిరిగి యథాస్థితికి చేరుకుని హరిని కీర్తించెను.

అప్పుడు హిరణ్యకశిపుడు నేను ఇప్పుడే నిన్ను వరప్రసాదమైన గదతో వధించెదనన్నాడు.
ప్రహ్లాదుడు చావుపుట్టుకలు మనచేతిలో లేవు. హరి నన్ను రక్షించును అనెను.
ఎవడా హరి? ఎందున్నాడని అడుగగా...
ఇందుగల డందులేడని సందేహము వలదు! హరి సర్వాంతర్యామి అని ప్రహ్లాదుడు అనెను.




చీలిపోయిన స్తంభం నుండి మిరుమిట్లుగొలిపే తేజస్సుతో ప్రళయభీకరంగా అవతరించిన నృసింహస్వామి హిరణ్యకశిపుని పొట్టచీల్చి, హతమార్చి ప్రహ్లాదుని రక్షించెను.

నమ్మినవారిని ఎల్లవేళలా రక్షింతునని హరి అభయమిచ్చెను. ప్రహ్లాదునిపై పూలవర్షం కురిసింది.

వచ్చే సంచికలో... మరో దివ్యలీలా విలాసాన్ని దర్శించి.. తరిద్దాం! స్వస్తి!




# పుట్టుకకు సార్థకత ఉండాలి!

– ఆచార్య పి.ఎల్.శ్రీనివాసరెడ్డి, 94414 93777

తే. జీవమున్నప్డె కాక చచ్చిన పిదపను
జగతి కెంతయు మేల్సేయ చాల వలయు
బ్రతికి వృక్షము నీడయు ఫలము లిచ్చు
చచ్చి, వంటకై చెరకును చాల కూర్చు

మనిషి బతికి ఉన్నప్పుడుమాత్రమే కాకుండా, చనిపోయిన తర్వాతకూడా సమాజానికి మేలుచేయగలగాలి. చెట్టు బతికి ఉన్నప్పుడు నీడనిస్తుంది, ఫలాల నిస్తుంది; చనిపోయిన తర్వాత వంటచెరకును చాలా సమకూరుస్తుంది.

కొందరు జీవించినంతకాలం ఇతరులను ఇబ్బంది పెడుతూనే ఉంటారు. వాళ్లను వదిలేద్దాం. కొందరుమాత్రం తమతోపాటు ఇతరులూ సుఖశాంతులతో జీవించాలనుకుంటారు. అందుకోసం తపన పడతారు. అయితే జీవించినంతకాలమే కాకుండా తదనంతరంకూడా సమాజానికి ఏదో మేలు జరిగేలా బతికి ఉన్నప్పుడే చేయగలగాలి. అందుకోసం మనుషులు అలా జీవిస్తున్నచెట్టును ఆదర్శంగా పెట్టుకోవాలి. ఎందుకంటే చెట్టు జీవించినంతకాలం నీడతో బాటు పండ్లనూ, చచ్చిపోయిన తర్వాత వంటకోసం కట్టెల్నీ ఇస్తుంది కాబట్టి.

ఒకాయనను ఉద్దేశించి ఆయన ఇంట్లో ఉండగానే ఫలానా ఆయన ఉన్నాడా అండీ? అని చుట్టుపక్కల ఇండ్లవాళ్లనే అడిగినా ఏమోనండీ తెలియదంటారు. బైటికో, పైకో పోయిన తర్వాత ఆయన పోయారట కదండీ! అన్నా ఏమో తెలియదండీ అంటారు. ఆయన ఉంటే



ఉన్నట్టు తెలియదు, పోతే పోయినట్టూ తెలియదు సమాజానికి. మరి ఆయన దేనికి ఉన్నట్టు?

చెట్లను ఆదర్శంగా తీసుకోకపోవడం అలా ఉంచి, వాటిని విచక్షణరహితంగా, విచ్చలవిడిగా నరికేస్తున్నారు-కొందరు. రెండువర్గాల వాళ్లు ఒకరినొకరు ఏమీ చేసుకోలేక ఎదుటివాళ్ళకు సంబంధించిన చెట్లను ఛేదిస్తున్నారు- సమూలంగా. కక్షలేమో మానవులకు- మరి శిక్షలేమో వృక్షాలకు. ఇంతకన్నా అన్యాయం ఇంకొకటుంటుందా?

లోకం పదికాలాలపాటు సజావుగా సాగాలనుకుంటే శ్రమజీవుల సేద తీర్చడంకోసం విప్పిపట్టిన గొడుగుల్లాగా నిలిచిన చెట్లను ఆదర్శంగా తీసుకొని జనాలు బతకడం అలవాటు చేసుకోవాల్సి ఉంటుంది!

# విశిష్టబాలుడు



**పేరు** – కలగా అచ్యుత్‌శర్మ
**పుట్టిన తేది** – 17-09-2015
**తల్లిపేరు** – శ్రీమతి శైలజ
**తండ్రిపేరు** – శ్రీ కె.ఎన్.వి.కామేశ్వరరావు
**తరగతి** – యూ.కె.జి
**అభినివేశం** – స్తోత్రపఠనం

పువ్వుపుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు చిరంజీవి కలగా అచ్యుత్‌శర్మ ఒకటిన్నర సంవత్సరం వయస్సులోనే మన హిందూ దేవతల సోత్రాలపట్ల విశేషఅభిరుచి పెంచుకున్నాడు. తెలుగుభాషను తనంతట తానే స్వయంగా చదవడం, రాయడం నేర్చుకున్నాడు. ముఖ్యంగా 1)విష్ణు సహస్రనామస్తోత్రం 2)లలితాసహస్రనామస్తోత్రం 3)శివభుజంగస్తోత్రం 4)రామాయణశ్లోకాలు 5)శివాపరాధక్షమార్పణస్తోత్రం 6)భగవద్గీత పూర్తిగా అధ్యాయాలు అన్నీ నేర్చుకున్నాడు. అంతటితో ఆగక పై స్తోత్ర పఠనాలన్నీ తన సొంత యూట్యూబ్ ఛానల్(*https://www.youtube.com/channel/UCsu20eDc-V4VzjiIG6FLTqg*)లో నిక్షిప్తం చేశాడు.

## సాధించిన విజయాలు

**01)** అతిచిన్నవయస్సులోనే దాదాపు స్తోత్రాలన్నీ నేర్చుకుని అప్పజెప్పినందుకు ఈ చిన్నారి *'ఇండియా బుక్ ఆఫ్ రికార్డు'*లో స్థానం సంపాదించాడు.

**02)** అతిచిన్నవయస్సులోనే భగవద్గీతలోని అన్ని అధ్యాయాలను చదవడం, పఠించడం, వ్రాయడం చేత *'ఇండియా బుక్ ఆఫ్ రికార్డు'*లో స్థానం సంపాదించాడు.



# క్విజ్

నిర్వహణ- డా॥ కంపల్లె రవిచంద్రన్

**1)** నమ్మాళ్వార్ శిష్యుడు?

అ) మధురకవి ఆళ్వార్ ఆ) తిరుప్పాణ్ ఆళ్వార్
ఇ) కులశేఖరాళ్వార్ ఈ) పేయాళ్వార్

**2)** నమ్మాళ్వార్‌కు గుడి కట్టించినవారు ఎవరు?

అ) తిరుప్పాణ్ ఆళ్వార్ ఆ) మధురకవి ఆళ్వార్
ఇ) కులశేఖరాళ్వార్ ఈ) పేయాళ్వార్

**3)** ఆంజనేయుడు ఎవరిదగ్గర మంత్రి?

అ) రాముడు ఆ) వాలి
ఇ) ఇంద్రుడు ఈ) సుగ్రీవుడు

**4)** ఆంజనేయుడు ఎవరిదగ్గర విద్యను అభ్యసించాడు?

అ) రాముడు ఆ) వాలి
ఇ) ఇంద్రుడు ఈ) సూర్యుడు

**5)** ఆంజనేయుడు ఎవరివరంవల్ల పుట్టాడు?

అ) వరుణదేవుడు ఆ) వాయుదేవుడు
ఇ) అగ్నిదేవుడు ఈ) సూర్యదేవుడు

**6)** హిరణ్యకశిపుడిని శ్రీమహావిష్ణువు ఏ అవతారంలో సంహరించాడు?

అ) కూర్మావతారం ఆ) మత్స్యావతారం
ఇ) నృసింహావతారం ఈ) వరాహావతారం

**7)** హిరణ్యాక్షుణ్ణి శ్రీమహావిష్ణువు ఏ అవతారంలో సంహరించాడు?


అ) కూర్మావతారం ఆ) మత్స్యావతారం
ఇ) నృసింహావతారం ఈ) వరాహావతారం

జవాబులు

1) ఆ 2) ఆ 3) ఈ 4) ఈ 5) ఆ 6) ఇ 7) ఈ

# చిత్ర లేఖనం

ఈ బొమ్మకు
రంగులు వేద్దామా...



పై బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...



SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 25-11-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742,
Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

